మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి గురువారం మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించి రోడ్లపై పారుతున్న మురుగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై మురుగు పారితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి కాలనీలో భూగర్భ డ్రైనేజీని నిర్మిస్తామన్నారు. మురుగునీరు రోడ్లపై కనిపించకుండా శాశ్వత పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. రోజుకు రూ.లక్ష



మేడ్చల్ డిపోలో ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

మేడ్చల్: ఉగాది నుంచి ఉగాది వరకు ఆర్టీసీలో రోజుకు రూ.లక్ష పెంచేందుకు ఆ శాఖ ఎండీ సజ్జనార్ ఏర్పాటు చేసిన లక్షే లక్ష్యం కార్యక్రమం సందర్భంగా మేడ్చల్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లతో డీఎం సుధాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి కార్మికుడు సంస్థ ఆదాయం పెరిగేలా ప్రతి రోజూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం రామారావు, సెక్యూరిటీ సిబ్బంది, మెకానిక్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారంతో మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో గురువారం తనిఖీ చేపట్టగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న పన్నాల మంగమ్మ ఇంట్లో 90 ఎంఎల్ ఆఫీసర్ చాయిస్ 50 బాటిళ్లు, కొండాపూర్‌లోని కొంపల్లి వెంకటేశ్వర్లు ఇంట్లో కింగ్ ఫిషర్ 650 ఎంఎల్ 12 బాటిళ్లు లభించాయి. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కబ్జాదారులపై కఠిన చర్యలు



జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

శామీర్‌పేట్: అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న వారిని మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. మేడ్చల్ కేఎల్ ఆర్ వెంచర్‌కు చెందిన విజయ్(44), శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తూంకుంటలోని ఒక ఓపెన్ సైట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బండరాళ్లను పేలుస్తున్నాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు సుమారు రూ.2.75 లక్షల విలువ గల (కంప్రెసర్, జిలెటిన్ స్టిక్స్)ను స్వాధీనం చేసుకొని, కంప్రెసర్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. సైట్ ఇంజినీర్ రోజా, కుమార్(జెలిటిన్ సరఫరా చేసే వ్యక్తి) వీరిద్దరూ పరారీలో ఉన్నరని తెలిపారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై లైంగికదాడి

పోచారం: రాత్రివేళ రోడ్డుపై వెళ్తున్న మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి చేసిన వ్యక్తిని పోచారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 30 ఏళ్ల మహిళ మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఘట్‌కేసర్ నుంచి అన్నోజిగూడ వరకు ఆటోలో వచ్చింది. అక్కడ నుంచి ఎల్‌ఎన్ కాలనీ రోడ్డుమీదుగా నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తుండగా అన్నోజిగూడకు చెందిన ఉమేష్ నాయక్(22) ఆమెను అడ్డగించి బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఎల్‌ఐజీ కాలనీ దగ్గర్లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఉమేష్ నాయక్‌ను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

చెరువులో మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి డబిల్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింహాగౌడ్ వివరాల ప్రకారం అహ్మదాబాద్‌కు చెందిన ప్రభు సోలంకి(36) మేడ్చల్ రైల్వే కాలనీలో నివాసం ఉంటూ పూలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న పూలు తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి వెళ్లిన ప్రభు తిరిగి ఇంటికి చేరుకోలేదు. గురువారం ఉదయం డబిల్‌పూర్ గ్రామంలోని పెద్ద చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి దర్యాప్తు చేసి రైల్వే కాలనీలో ఉండే ప్రభు సోలంకిగా గుర్తించారు. మృతుడు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

టార్గెట్‌పై ఫోకస్



- పన్నుల టార్గెట్ రూ.284.41 కోట్లు
- వసూలైన పన్నులు రూ.209.04 కోట్లు
- రూ.75.37 కోట్ల వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- ఈ నెలాఖరు వరకు పూర్తి చేసేలా కసరత్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: శివారు పట్టణాల్లో కాసుల గలగల ఉంటే తప్ప అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే అధికార యంత్రాంగం పన్నుల వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అయితే.. వరుసగా అసెంబ్లీ ఎన్నికలు.. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నగర శివారు పట్టణాల్లో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసి.. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనా.. గడిచిన 2023–24 ఆర్థిక సంవత్సరం పన్నుల బకాయిలపైనే పురపాలక సంఘాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొనటంతో అభివృద్ధి పనులపై అంతగా శ్రద్ధ చూపలేకపోతున్నారు.

ఈ నెలాఖరు వరకు వసూలు చేసేందుకు..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో 13 పురపాలక సంఘాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల ద్వారా రూ.284.41 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యాన్ని అధికార యంత్రాంగం నిర్దేశించినప్పటికీ ఇప్పటి వరకు రూ.209.04 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. మిగతా పన్నులు రూ.75.37 కోట్లు ఈ నెలాఖరు వరకు వసూలు చేసేందుకు పురపాలక యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో రోజువారి మానిటరింగ్‌కు పూనుకుంటోంది. వరుస ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లలో జాప్యం జరిగిందని పేర్కొంటున్న అధికారులు ఏప్రిల్ నెలాఖరు వరకు పూర్తి చేస్తామంటున్నారు.

పన్నుల టార్గెట్ రూ.247 కోట్లు

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉండగా, రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా మేడ్చల్ జిల్లాలో నాలుగు కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. 13 పురపాలక సంఘాల నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల రూపంలో రూ.247.43 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో పురపాలక సంఘాలు గతేడాది ఆర్థిక సంవత్సరంలో నిలిచిపోయిన పన్నుల బకాయి వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

13 పురపాలక సంఘాలు.. 2023–24 సంవత్సరం

పురపాలక సంఘం	పన్ను లక్ష్యం (రూ.కోట్లలో)	పన్ను వసూలు
బోడుప్పల్	రూ.28.65	రూ.19.21
పీర్జాదిగూడ	రూ.34.68	రూ. 21.98
నిజాంపేట	రూ.70.06	రూ.53.64
జవహర్‌నగర్	రూ.12.02	రూ.7.71
దమ్మాయిగూడ	రూ.16.23	రూ.10.81
నాగారం	రూ.18.92	రూ.15.53
పోచారం	రూ.10.90	రూ.7.78
ఘట్కేసర్	రూ.6.79	రూ.4.29
మేడ్చల్	రూ.17.27	రూ.14.02
గుండ్లపోచంపల్లి	రూ.13.04	రూ.9.97
తూముకుంట	రూ.11.95	రూ.10.36
దుండిగల్	రూ.30.58	రూ.22.29
కొంపల్లి	రూ.13.26	రూ.10.42
మొత్తం	రూ.284.41	రూ.209.04

తగిన షెడ్యూల్‌తో..

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు ఇప్పటి వరకు రూ.11.18 కోట్లు వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో టార్గెట్‌లో మొత్తంగా ఐదు శాతం పన్నులు వసూలు కాగా, ఇందులో బోడుప్పల్ 14 శాతం, పీర్జాదిగూడ 11 శాతం పన్నులు వసూలు చేశాయి. దుండిగల్, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలు 5 శాతం చొప్పున పన్నులు వసూలు చేయగా, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు 4 శాతం చొప్పున పన్నులు వసూలు చేశాయి. మిగతా పురపాలక సంఘాలన్నీ ఒకటి నుంచి మూడు శాతం పన్నులు వసూలు చేసిన జాబితాలో ఉన్నాయి. మిగిలిన పన్నులన్నీ వచ్చే మార్చి 2025 వరకు వసూలు చేసేందుకు గడువు ఉండటంతో.. తగిన షెడ్యూల్‌తో ముందుకెళ్లేందుకు మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు.

నేర నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలి

రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి



కీసర పోలీస్ స్టేషన్ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి

కీసర: నేర నియంత్రణలో పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. గురువారం ఆయన కీసర పోలీస్ స్టేషన్‌ను సందర్శించి క్రైమ్ రివ్యూ మీటింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, పెండింగ్ కేసుల విచారణ, ఇతర కేసుల విచారణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు నిమిత్తం వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారి బాధలను ఓపికగా విని న్యాయం చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను సీఐ వెంకటయ్య, పోలీస్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ, ఏసీపీ నరేందర్‌గౌడ్, కీసర పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్‌ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈటలకు కారు లేదట

- సతీమణి జమునకు 3 కార్లు
- ఆస్తులు ఆయన కంటే భార్యకే ఎక్కువ
- ఆస్తులు మొత్తం రూ.54.01 కోట్లు..
- అప్పులు రూ.20.46కోట్లు
- రాజేందర్ పై ఉద్యమ , రాజకీయ కేసులు 54

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు కారు లేదని, తన సతీమణి జమునకు మాత్రం మూడు కార్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీజేపీ పార్లమెంటు అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతం కు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా దాదాపు 39 పేజీల అఫిడవిట్ ను సమర్పించారు. తెలంగాణ ఉద్యమంలో చెప్పట్టిన ఆందోళనలో భాగంగా రైల్ రోకో ఇతరతర రాజకీయ సంబందమైన కేసులు 54 వరకు ఉన్నట్లు ఈటల పేర్కొన్నారు. ఆస్తులకు సంబంధించి రూ.54.01 కోట్లు పేర్కొనగా, అప్పులు రూ.20.46 కోట్లు చూపించారు. రాజేందర్ వద్ద రూ. ఒక లక్ష నగదు ఉండగా, జమున వద్ద నగదు రూ.1.42 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే, స్థిర ఆస్తుల విలువ రాజేందర్ కు సంబంధించి రూ.2.50 కోట్లు చూపించగా, జమున స్థిర ఆస్తుల విలువ రూ.3 కోట్లు పేర్కొన్నారు. అలాగే, ఇతర ఆస్తుల్లో రాజేందర్‌కు సంబంధించి రూ.6.73 కోట్లు ఉండగా, భార్య జమున ఆస్తి రూ.26.66 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. బంగారం 1500 గ్రాములు ఉండగా, దాని విలువ రూ.50 లక్షలు చూపించారు. అప్పులకు సంబంధించి రాజేందర్ రూ.5.47 కోట్లు పేర్కొనగా, ఆయన సతీమణి అప్పులు రూ.14.94 కోట్లు ఉన్నట్లు తెలిపారు.ఇందులో బ్యాంకు రుణాలు కుడా ఉన్నట్లు పేర్కొన్నారు.

మల్కాజ్‌గిరిలో బీజేపీ గెలుపు ఖాయం



నాగారంలో మాట్లాడుతున్న చంద్రారెడ్డి



కట్టమైసమ్మ ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు చేస్తున్న ఈటల జమున

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ సందర్భంగా నాగారం నుంచి బీజేపీ కార్యకర్తలు, నేతలతో కలిసి గురువారం ఆయన ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరారు. నాగారంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ గాలి విస్తోందని, మూడోసారి కూడా దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం, మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమిలకు ప్రతిపక్ష హోదా తప్పదన్నారు. బీజేపీ నేతలు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీ వేణుగోపాల్, బుచ్చిరెడ్డి, మల్లేష్‌వంశరాజ్, సురేష్, బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలకు పూజలు

శామీర్‌పేట్: మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా ఉదయం ఆయన సతీమణి జమున శామీర్‌పేట్ కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ పత్రాలను కట్టమైసమ్మ అమ్మవారి వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ఆ పత్రాలతో ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు చేశారు.

కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు మేలు



నాగారం మున్సిపాలిటీలో కాంగ్రెస్ నేతల ప్రచారం

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని, ఇందుకోసం ప్రజలంతా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మేడ్చల్–మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలందరికీ గతంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని, పథకాలను అందని వారికి ఎన్నికల తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. రెండుసార్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్మన్‌గా ఉండి ఇక్కడి ప్రాంతాల అభివృద్ధికి పాటుపడిన పట్నం సునీతామహేందర్‌రెడ్డికే ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు పంగ హరిబాబు, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గూడురు అశోక్‌గౌడ్, నేతలు సురేష్, మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, కౌకుట్ల శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణిగౌడ్, సతీష్‌గౌడ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం కొర్రెముల్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కందుల రాజుముదిరాజ్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌గౌడ్ గురువారం కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాజేశ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వార్డు సభ్యులు అంజనేయులు, స్వామి, నగేశ్, రవి పార్టీలో చేరగా వెంకటేశ్, బాబారావు, బాల్‌రాజ్‌యాదవ్, నర్సింహ, వినోద్‌కుమార్, నరేశ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉద్దమర్రి గ్రామానికి చెందిన పలువురు..

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉద్దమర్రి మాజీ సర్పంచ్ దోసకాయ వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు బలరాంరెడ్డి, భవానందచారి, బాలపోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, శేఖర్‌తో పాటు 40 మంది కార్యకర్తలు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు విష్ణుగౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న ఉద్దమర్రి గ్రామానికి నాయకులు

కేసీఆర్ నేతృత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

హబ్సిగూడ: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటుహక్కు కూడా లేదని విమర్శించారు. ఆ పార్టీ అభ్యర్థులు హెలికాప్టర్‌లో వచ్చి వెళ్లేవాళ్లని, తాను మీ అందరికీ అందుబాటులో ఉంటూ.. ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. నాయకులు పసూల ప్రభాకర్‌రెడ్డి, బీవీ.చారి, సోమిరెడ్డి, లక్ష్మీనారాయణ, యాదగిరి, కైలాషపతిగౌడ్, మనోహర్, బుచ్చిరెడ్డి, నవీన్, యాదమ్మ, లింగయ్యనాయక్, రవీందర్‌రెడ్డి, యాకాంత్‌రావు, అబ్బు, చంద్రశేఖర్, నరేందర్, వీరేందర్, రాజు, శ్యామ్‌సుందర్, సురేందర్, గణేష్, దినేష్, వెంకటయ్య, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

బద్దం రంగమ్మకు నివాళి

ఘట్‌కేసర్: కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి తల్లి బద్దం రంగమ్మ దశదిన కర్మను ఘనాపూర్‌లో గురువారం నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బద్దం గోపాల్‌రెడ్డి నివాసంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మృతురాలి కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కోడళ్లు మంజుల, స్వప్న, జ్యోతి, కూతుర్లు మహేశ్వరీ, లలిత, అండాలు, అల్లుల్లు రాఘవరెడ్డి, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, సత్తయ్యముదిరాజ్, పరమేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, శంకర్‌గౌడ్, సురేశ్‌నాయక్ ఉన్నారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



సంపత్‌గౌడ్ (ఫైల్)

శామీర్‌పేట్: హోల్డ్‌లో పెట్టారని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం బాబాగూడ గ్రామానికి చెందిన కాసాల సంపత్‌గౌడ్(23), హైటెక్ సిటీలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో (వర్క్ ఫ్రమ్ హోమ్) ఉద్యోగం చేస్తున్నాడు. సదరు సాఫ్ట్‌వేర్ కంపెనీ యాజమాన్యం కారణం తెలపకుండానే హోల్డ్‌లో పెట్టింది. దీంతో మనస్తాపానికి చెందిన సంపత్‌గౌడ్‌ను శామీర్‌పేట గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఒకే నెలలో ఇంట్లో ఇద్దరు మృతి..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంపత్‌గౌడ్ తన తల్లి, చెల్లి, నానమ్మ తాతయ్యతో కలిసి బాబాగూడలో నివాసముంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా గత నెలలో తాత మృతిచెందడంతో దహన సంస్కారాలతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు లీవ్ పెట్టాడు. కారణం తెలపకుండానే అతడికి రావాల్సిన జీతంతో పాటు సదరు కంపెనీ హోల్డ్‌లో పెట్టింది. దీంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పాత, కొత్త కలయిక..

అంతంత మాత్రమే..

- చేరికలపై అభ్యంతరాలు వద్దు
- బహిరంగంగా నోరు విప్పొద్దు..
- అసంతృప్తులకు సీరియస్ వార్నింగ్



మేడ్చల్: కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి గేట్లు ఎత్తడటంతో మేడ్చల్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరిగాయి. కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్‌లో ప్రధాన పదవుల్లో ఉన్న నాయకులు ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మేడ్చల్‌లో 11 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్, పదుల సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, జవహర్‌నగర్, పీర్జాదిగూడలో కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. అధిష్టానమే వలసలను ప్రోత్సహించడంతో అధికారం కోసం ఎగబడే నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడుతున్నారు.

బహిరంగంగా నోరు విప్పితే..

రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి, అంతకుముందు నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులు ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు తాము స్థానికంగా ఏ నాయకులపై పోరాడామో ఆ నాయకులను చెప్పకుండా కాంగ్రెస్‌లో చేర్చుకుంటే రాజకీయంగా తమను సమాధి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఇన్నాళ్లు ప్రత్యర్థులుగా ఉన్న వారిని తమ నెత్తిన తెచ్చిపెడుతూ తమ సీనియార్టీని అవమానపరుస్తున్నారని బాధపడుతున్నారు. మేడ్చల్‌లో 11మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడం ఇష్టం లేని నాయకులు ఇటీవల సమావేశంలో బహిరంగంగానే తప్పుబట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అధిష్టానంలో ఉన్న నాయకులు వారికి సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఎవరైనా బహిరంగంగా నోరు విప్పితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.

కలవని పాత, కొత్త నాయకులు..

ఎన్నికల వేళ బీఆర్‌ఎస్ నుంచి అధిక మంది నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో నాయకుల మధ్య పాత కొత్త విధానం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్‌కు అన్ని ప్రాంతాల్లో బలమైన క్యాడర్ లేకపోవడం, కొత్తగా చేరిన వారితో పేపర్‌పై రాస్తే కాంగ్రెస్ నాయకుల పేర్లు ఎక్కువగానే కనిపిస్తున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం చేసే వారు లేకపోవడంతో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితం రావడం లేదు. తాజాగా నాయకుల సంఖ్య ఫుల్లుగా ఉన్నా ప్రచారంలో అందరి ముఖాలు కనబడటం లేదు. మహిళా కౌన్సిలర్లు ఎక్కడా కనిపించడం లేదు. పార్టీలో చేరాం.. పిలిస్తే వెళతాం లేదంటే తమ వార్డుల్లో పని చేసుకుంటాం అనే సమాధానం వలస నాయకుల నుంచి వస్తోంది. పలువురు నాయకులు ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు చేస్తుండటంతో కాంగ్రెస్‌కు నియోజకవర్గంలో పెద్ద సమస్యగా మారింది. పైకి అందరూ కలిసి ఉన్నట్లు కనిపిస్తున్నా ఎవరి అనుచరులను వారు మెయింటెన్ చేస్తున్నారు. తమకంటూ అనుచర వర్గాన్ని తయారు చేసుకుంటున్నారు. మల్కాజ్‌గిరి ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మేడ్చల్‌ను పట్టించుకుని పార్టీని గాడిలో పెట్టి, అందరికీ సముచిత న్యాయం జరిగేలా కృషి చేయాలని నాయకులు కోరుతున్నారు.